# జుగ్ జ్వాంగ్

కౌలూరి ప్రసాదరావు

పద్మవ్యూహంలో చిక్కుకున్న అభిమన్యునిలా బోర్డువైపు నిస్సహాయంగా చూస్తున్నాను. మరో మూడెత్తుల్లో నా ఆట కడుతుంది. ఫోర్స్‌డ్ మేట్! ఈ క్లబ్‌లో ఇటువంటి క్లిష్ట పరిస్థితి నాకెప్పుడూ ఎదురవలేదు. మరీ ముఖ్యంగా మూర్తి చేతిలో... చెమట ధారాపాతంగా కారుతోంది.

అందరూ తమ ఆటల్ని మధ్యలోనే వదిలేసి నా టేబుల్ చుట్టూ మూగి ఊపిరి బిగబట్టి చూస్తున్నారు. కొంతమంది సానుభూతిగా... మరికొందరు హేళనగా... మూర్తి అయితే చెప్ప క్కర్లేదు. విజయగర్వంతో పొంగిపోతున్నాడు. బోర్డువైపు చూడడం మానేసి ఓడిపోబోతున్న నా ముఖకవళికల్ని కసిగా ఎంజాయ్ చేస్తున్నాడు. ఎందుకంటే మూర్తికి ఇదే మొదటి గెలుపు నామీద! చిన్నపిల్లాడిలా సంబరపడిపోతున్నాడు. గేమ్‌కి వెయ్యిరూపాయలు పందెం పెట్టుకున్నాం. నేనెప్పుడూ మూర్తికి వెయ్యిరూపాయలు కోల్పోలేదు. ఇన్నాళ్లకి మొదటిసారిగా మూర్తి నాదగ్గర వెయ్యి రూపాయలు వసూలు చేయబోతున్నాడు.

అయితే వెయ్యి రూపాయలు పందెం పోతుందని కాదు నేను బాధపడేది. మూర్తి అద్భుతమైన ఆట తీరు కారణంగాకాక నా పొరపాటు వల్ల ఓడిపోతున్నాను. అదే అమితంగా బాధిస్తోంది నన్ను...

నిజానికి బోర్డుపై నా బలగాలు అంత ఘోరంగా ఏమీలేవు. చెరో రాజు, నాకు మూడు బంట్లు, మూర్తికి రెండు బంట్లు, నాకు ఒక ఏనుగు, మూర్తికి రెండు ఏనుగులు ఉన్నాయి. అంటే నా బంటు ప్రతిగా మూర్తికి ఏనుగు ఉందన్నమాట. అయినా ఫరవాలేదు. ఏడవ ర్యాంక్‌లో ఉన్న నా మూడో బంటు, ఎనిమిదో ర్యాంక్‌లో ఉన్న మూర్తి రెండవ ఏనుగుపై దాడి చేస్తోంది. ఆ ఏనుగును చంపి బంటు మంత్రిగా మారి నాకు గెలుపును సునాయాసంగా అందిస్తుంది.

ఆ వ్యూహంతోనే నా రెండో ఏనుగును త్యాగం చేసి బంటును ముందుకు నడిపించాను. అంతవరకూ బాగానే ఉన్న నా పథకం అక్కడే బెడిసి కొట్టింది. వెనుదిరిగి చూసుకుంటే నా రాజు మృత్యుకుహరంలో చిక్కుకుని విలవిల లాడుతున్నాడు. బంటుని మంత్రిగా మార్చాలనే తాపత్రయంతో రాజు రక్షణ మరచిపోయాను. అదే నన్ను పరాజయం అంచులకు లాక్కెళ్లింది.

మూర్తి తన ఏనుగు పోతుందని భయపడలేదు. ప్రత్యర్థికి మంత్రి వస్తుందని అసలు ఖాతరు చేయలేదు. తన రాజుని 'చెక్' అవనీయకుండా సురక్షిత స్థానంలో నిలిపాడు.

నరాలు చిట్లిపోయే ఈ ఎండ్‌గేమ్‌లో ఈ

'వెయిటింగ్ మూవ్' ఏమిటా అని తీవ్రంగా ఆలోచిస్తూ మూర్తి వ్యూహం అర్థమై ఒళ్లు జలదరించింది. దాడికి గురవకుండా తప్పుకున్న మూర్తి రాజు, నా రాజుని పారిపోనీకుండా ఆపుతోంది. మరో వైపు నా సొంత బంట్లే నా రాజు పారిపోకుండా దిగ్బంధం చేసాయి. 'హెచ్' ఫైల్లో ఇరుక్కుపోయింది నా రాజు... ఊపిరి ఆడనీకుండా దాడి చేసే 'టెంపో' ఇపుడు మూర్తికి లభించింది. మంత్రి వచ్చినా గెలిచే పరిస్థితి లేదు. బంటుతో ఏనుగుని చంపి మంత్రిగా మారిస్తే మూర్తి తన బంటుని కదిపి త్రోసిరాజంటాడు. రాజు ఒక గడి (ఉన్నది అదొక్కటే) జరిగితే ఏనుగుతో బంటుని చంపి ఆటకట్టు చేస్తాడు. పోనీ రాజుని నిరోధిస్తున్న బంటుని కదిపితే నా బంటు పగలో ఉన్న ఏనుగుతో 'చెక్‌మేట్' చేస్తాడు. కనీసం 'డ్రా' చేసే అవకాశం కూడా లేదు.

"ఇంకెందుకండీ! తెగేదాకా లాగటం? రిజైన్ చేయొచ్చుగా! హుందాగా ఉంటుంది"



ఎవరో పరిహాసంగా అంటున్నారు. నిజమేకాని చెస్ ప్లేయర్‌కి సహనం ఉండాలి. చేప కోసం కొంగ ఎంత ఓర్పుగా వేచి చూస్తుందో... ప్రత్యర్థి చేసే చిన్న తప్పు కోసం అంతే ఓర్పుగా ఎదురుచూడాలి. ఎలాగూ గెలవబోతున్నాననే గర్వంతో ప్రత్యర్థి కొంచెం నిర్లక్ష్యంగా ఆడతాడు. అది చాలు... పరిస్థితిని తలక్రిందులు చేయడానికి. 'నందో రాజా భవిష్యతి'లా చివరి క్షణంలో ఏమైనా జరగవచ్చు. పైగా అంత త్వరగా ఓటమిని అంగీకరించే మనస్తత్వం కాదు నాది. ఆఖరి క్షణం వరకూ పోరాడే నైజం నాది.

"ఫరవాలేదు! టైంతీసుకుని బాగా ఆలోచించుకో! సాయంత్రం వరకూ ప్రయత్నించు! ఒరేయ్ శీనూ! రెండు టీలు పట్రారా! చెలగాటమాడుతున్నాడు మూర్తి. అవకాశం దొరికిందని మూర్తి రెచ్చిపోతున్నాడు. మనసు కుతకుతలాడుతోంది.

'వెధవ!' ఏంఫోజు కొడుతున్నాడు. మరోసారి వీడికి తగిన బుద్ధి చెప్పాలి. చెస్ అంటేనే విరక్తి కలిగేలా ఘోరపరాజయం రుచి చూపించాలి" మనసులోనే భీషణ ప్రతిజ్ఞ చేసాను. నిజానికి ఇదేమీ అంతర్జాతీయ మ్యాచ్ కాదు. దేశ ప్రతిష్టతో ముడిపడి ఉన్న అంశం కాదు. ఆఫ్టరాల్! ఓ క్లబ్ గేమ్! అయినా గెలుపు గెలుపే! ఓటమి ఓటమే! ఆలోచనలతో ఉక్కిరి బిక్కిరి అవుతూ కళ్లు మూసుకున్నాను.

వెంటనే నా భార్య ప్రత్యక్షమైంది. "సాయంత్రం లోగా మీరు ఏ విషయమూ తేల్చకపోతే నేనే ఓ నిర్ణయానికొస్తాను ఖబద్దార్" అంటోంది. చెస్ బోర్డు మీది సమస్య కంటే పెద్ద సమస్య ఇంట్లో ఉంది. దాని మీదే ఉదయం నా భార్యతో ఘర్షణ జరిగింది. ఆ చికాకుతోనే క్లబ్‌కొచ్చి ఏకాగ్రత కోల్పోయి మూర్తికి దొరికిపోయాను.


తరగని ఆస్తి ఉన్నా తినటానికి పిల్లల్లేరు నాకు. ఎన్నో పూజలు పునస్కారాలు, వ్రతాలు, నోములు, పుణ్యక్షేత్ర తీర్థ సందర్శనాలు విఫలమయ్యాయి. ఎన్నిరకాల మందులు వాడినా ప్రయోజనం శూన్యమైంది. చివరికి దత్తత తీసుకోవాలనే నిర్ణయానికొచ్చాం.

ఎవర్ని దత్తత తీసుకోవాలనే దానిమీదే ఇంత కాలయాపన జరిగింది. తన చెల్లి కొడుకుని దత్తత తీసుకోవాలని నా భార్య పట్టుదల. కానీ నాకిష్టంలేదు. ఎందుకంటే వాడో వాజమ్మ. నా ఆకాంక్ష నెరవేర్చే లక్షణాలేవీ వాడిలో లేవు. నా కోరిక నెరవేర్చే కుర్రాడికోసం నేను చేస్తున్న అన్వేషణ ఇంకా ఫలించలేదు.

చెస్ సూపర్ గ్రాండ్ రెండో మాస్టర్ అవ్వాలని, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని దేశానికి కీర్తిప్రతిష్టలు తీసుకురావాలని ఎంతగానో ఆశించాను. కాని నా ఆశలు అడియాసలయ్యాయి. కేవలం క్లబ్‌కి పరిమితమైపోయాను. కనీసం నా కొడుకైనా గ్రాండ్ మాస్టర్ కావాలని, నేను సాధించాలని ఆశించిన విజయాలు సొంతం చేసుకుంటాడని వాంఛించాను. కాని నా కలలు కల్లలయ్యాయి.

నాకు సంతాన భాగ్యం లేకపోయినా దత్తత తీసుకునే కుర్రాడైనా నా ఆశయాన్ని నిలిపే మెరికెలాంటి ఆటగాడు కావాలని నా పట్టుదల. ఇంతవరకూ నా నిరీక్షణ ఫలించలేదు.

నా భార్య సహనం కోల్పోయింది. తన చెల్లి కొడుకుని పెంచుకుందామని అల్టిమేటం ఇస్తోంది. వారసుడి కోసమని సేకరించిన పుస్తకాలు రాక్‌లోంచి నన్ను వెక్కిరిస్తుంటాయి. చెస్‌మేట్లు, ఇన్ఫర్మేటర్లు, ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ చెస్ ఓపెనింగ్, మిడిల్‌గేమ్, ఎండ్ గేమ్ వగైరాలు ఎప్పటికప్పుడు అప్‌టూడేట్ చేస్తుంటాను. చదరంగం




బోర్డుమీద తెలుపు, నలుపు శగటులు ప్రక్క ప్రక్క గడుల్లో కలిసే ఉన్నట్లు కన్పిస్తాయి. నిజానికి ఆ రెండు ఎప్పుడూ కలవ్వు. దేని దారి దానిదే. దేని గడి దానిదే. నేనూ, నా భార్య కూడా అంతే! కలిసి జీవించినా ఎవరి అభిప్రాయం వారిదే. పైగా బోలెడంత ఆస్తిని తెచ్చిందన్న అహంకారం.

"ఊరికే బుర్ర బద్దలు కొట్టుకోకు! ఈ టీ తాగు ముందు" మూర్తి మాటలతో ఆలోచనలు చెదిరి, కళ్లు తెరిచాను. శీనుగాడు కప్పు అందించాడు. టీ తాగాక కాస్త ఉపశమనం కలిగింది. తేలిక పడిన మనసుతో జేబులోంచి వెయ్యి రూపాయల నోటు తీసి మూర్తి వైపు చెయ్యి చాచాను "ఇదిగో! మూర్తి పందెం డబ్బు నేను రిజైన్ చేస్తున్నా... తీసుకో" అన్నాను. వరల్డ్ ఛాంపియన్ అయిన వాడిలా ఫీలవుతూ మూర్తి నోటు అందుకోబోతుండగా ప్రక్కనే నిలబడి ఉన్న శీనుగాడు హఠాత్తుగా "ఆగండి సార్! మీరు గెలుస్తారు" అన్నాడు. మూర్తి ఉలిక్కిపడ్డాడు. నేనూ అయోమయంలో పడిపోయాను. గేమ్ చూస్తున్న వారంతా శీనుగాడివైపు తిరిగారు అపనమ్మకంగా...

"నిజమేనండీ? మీ వెయ్యిరూపాయలు ఎక్కడికీ పోవు" అన్నాడు.

లేచిన మూర్తి తిరిగి సర్దుకుని "ఆడవోయ్! ఈ కుర్రకుంక నిన్ను గెలిపిస్తాడు. నీ వెయ్యి రూపాయలను రక్షిస్తాడు. ఫర్లేదు..ఆడు" అన్నాడు ఎకెసెక్కంగా...

శీనుగాడు ఇదేమీ పట్టించుకోకుండా "సార్! బంటుతో ఏనుగుని చంపి ఆ బంటుని మంత్రిగా కాక గుర్రంగా మార్చండి. గెలుపు మీదే" అన్నాడు. గేమ్ చూస్తున్న అందరూ షాక్‌తో స్తంభించిపోయారు. అండర్ ప్రమోషన్! నాకు నిజంగా తట్టని ఐడియా. సాధారణంగా ఎనిమిదో ర్యాంక్ చేరిన పాన్‌ని మంత్రిగా మాత్రమే

ప్రమోట్ చేయడానికి ప్రయత్నిస్తారు. చిన్న బలగంగా ఎవరూ ఊహించరు. ఎందుకంటే బోర్డుమీద అతిశక్తివంతమైన బలగం మంత్రి మాత్రమే కనుక. అద్భుతమైన ఎత్తు. మూడు ఎక్స్‌క్లమేషన్ మార్క్స్ ఇవ్వదగిన ఎత్తు ఇది. బంటు గుర్రంగా మారి రాజుమీద దాడి చేస్తోంది. అత్యవసరమైన టెంపో దొరికింది. దటీజ్ పొజిషనల్‌ప్లే... ఇక ఓడిపోయే ప్రసక్తే లేదు. రాజుని తప్పిస్తే మరో ఎత్తులో గుర్రం రాజుకి, ఏనుగుకి ఫోర్క్ వేస్తుంది. రెండో ఏనుగు కూడా పోతుంది. మూర్తి రిజైన్ చేసాడు. హాలంతా చప్పట్లతో మార్మోగిపోతోంది.

శీనుగాడు అనాథ. ఈ క్లబ్‌లోనే బోయ్‌గా పనిచేస్తున్నాడు. టీలు, సిగరెట్లు తేవడం, తోట పని చేయటం వాడి పని. క్లబ్‌లోనే పడుకుంటాడు. వాడినెపుడూ పట్టించుకోలేదు నేను. వాడిలో ఇంత గొప్ప ఆటగాడున్నాడని ఇప్పుడే వెల్లడైంది. నా వారసుడు దొరికాడు... ఇన్నాళ్ల నా నిరీక్షణ ఫలించింది.

నా మనసు పుత్రోత్సాహంతో పొంగిపోయింది. "ఇది నిజమైన గెలుపుకాదు. నిజానికి ఈ ఎత్తు నాకు తట్టనేలేదు. ఇంద వెయ్యి తీసుకో" అన్నాను మూర్తితో... మూర్తి మొహం జేవురించి ఉంది. దెబ్బతిన్న పులిలా గాండ్రించాడు. "శీనుగా ఇలా రారా" శీనుగాడు బెరుగ్గా అడుగులు వేసాడు. మూర్తి చాచి లెంపకాయ కొట్టాడు.

"ఛీరా! దిక్కులేని వెధవా! జాలిపడి క్లబ్‌లో పని ఇప్పిస్తే బుద్ధిగా పనిచేసుకోకుండా ఆటలాడుతూ చివరికి మాకే ఆట నేర్పే గొప్పవాడివయ్యావన్నమాట. ఛీ! మళ్లీ ఈ క్లబ్ ఛాయలకు రాకు. మళ్లీ నాకు కనిపించావంటే తోలు తీస్తా" అని మెడబట్టి బయటకు గెంటాడు.

శీనుగాడు మూర్తి కాళ్లు పట్టుకుని "తప్పయింది సార్! ఇంకెప్పుడూ చెస్ బోర్డు దగ్గరకు రాను. ఈసారికి క్షమించండి. మీరు గెంటేస్తే మళ్లీ ఫుట్‌పాత్ బ్రతుకైపోతుంది" అన్నాడు దీనంగా... మూర్తి మనసు కరగలేదు. సెంట్రీని పిలిచాడు శీనుగాడిని బయటకి గెంటమని.

కిందపడ్డ శీనుని లేపి అక్కున చేర్చుకున్నాను నేను. 'పద మా యింటికి' అన్నాను. బేలగా చెయ్యి పట్టుకుని అనుసరించాడు. ఇప్పుడు నాకు మహోదానందంగా ఉంది.

ఇంటికి వెళ్లేసరికి మా అత్తామామలు పలకరించారు. ఇల్లంతా సందడిగా ఉంది. నా మనసు కీడు శంకించింది. 'వీళ్లెందుకు వచ్చారబ్బా' అనుకుంటూ లోపలికి వెళ్లేసరికి మా మరదలు, తోడల్లుడితో సహా నా భార్య తరపు బంధువులంతా కన్పించారు.

నా భార్య తన చెల్లి కొడుకుని తీసుకొచ్చి "బాబూ! నాన్నగారి కాళ్లకు దణ్ణం పెట్టు" అంటోంది. "ఏమిటిదంతా" అన్నాను మెల్లగా. "ఏమిటంటారేమిటండీ! మా చెల్లెలి కొడుకుని దత్తత తీసుకుంటున్నాం... రేపు బ్రహ్మాండమైన ముహూర్తం ఉంది. మావాళ్లంతా వచ్చేసారు. మిగిలిన వాళ్లు రేపు ముహూర్తం సమయానికి వచ్చేస్తారు. రండి చాలా పనులున్నాయి... అని ఆగి "ఇంతకీ ఈ అబ్బాయెవరు" అంది అనుమానంగా చూస్తూ.

ఏదో చెప్పాలని ప్రయత్నించాను గాని గొంతు పూడుకుపోయి మాట బయటికి రాక శిలా ప్రతిమలా నిలబడిపోయాను.

"చదరంగంలో వలెనే జీవితంలో కూడా ముందు చూపు ఎంతో అవసరం" -బక్స్‌టన్

Zugzwang = Obligation to move